సాక్షి విశాఖపట్నం

శనివారం । 30 । నవంబర్ । 2024



ఏయూలో కొత్త కోర్సు
ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సు 8లో



నేత్ర పర్వంగా లక్షదీపోత్సవం 8లో



సిటీకి జ్వరమొచ్చింది 8లో

కేరింత





బీచ్ రోడ్డు రాడిసన్ బ్లూ హోటల్‌లో శుక్రవారం ఓ విద్యాసంస్థ ఫ్రెషర్స్ డే వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యువతీయువకులు ర్యాంప్ వాక్ కేక పుట్టించింది. విద్యార్థులు ఎంతో హుషారుగా గడిపారు. సెల్ఫీలతో సందడి చేశారు. – కొమ్మాది

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రంగుల ప్రపంచంలో... స్వేచ్ఛా విహంగంలా..



వుడా పార్కులో చిన్నారులు సందడి చేశారు. కార్తీక వనభోజనాలకు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు విశాఖ అందాలను తిలకించారు. ఆకాశమే హద్దుగా ఆడిపాడారు.

‘మధ్యాహ్న భోజనం’లో రాజీ పడొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించిన కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించిన వివరాలను అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో క్వాలిటీ, క్వాంటిటీలలో అధికారులు ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. ఎంపీడీవోలు, హెచ్ఎంలు తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్ఓ భాస్కర రావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో...



ఆనంద్ రాజేశ్వర్ బైవార్‌కు అప్పన్న చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ఆదాయపు పన్నుశాఖ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్ (ఐఆర్ఎస్) కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికలను సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందజేశారు.

ముగ్గురు పోలీసులకు పదోన్నతి



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరిస్తున్న సీపీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురికి పదోన్నతి లభించింది. అసిస్టెంట్ ఏఎస్ఐకు డిప్యూటీ ఏఎస్‌ఐగాను, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌కు డీఎస్పీ (ఏఆర్)గాను, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌కు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వారిని పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించి ర్యాంకులను, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 అజిత వేజెండ్ల, డీసీపీ–2 మేరీ ప్రశాంతి, డీసీపీ(క్రైమ్) లతా మాధురి, ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న మేయర్ హరివెంకట కుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో 30 మందికి కారుణ్య నియామకాలు జరిగాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం తన చాంబర్లో నియామక పత్రాలు అందజేశారు. జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు 30 మందికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు మేయర్ తెలిపారు. వీరిలో ఒకరు వర్క్ ఇన్‌స్పెక్టర్ కాగా, 10 మంది కార్యాలయ సబార్డినేటర్లు, ముగ్గురు పీహెచ్ మేస్త్రులు, నలుగురు పీహెచ్ వర్కర్లు, 12 మంది మజ్దూర్లు ఉన్నారు. ఈ 30 మంది సంబంధిత విభాగాల్లో వెంటనే విధుల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ షాపులపై విజిలెన్స్ దాడులు

విశాఖ సిటీ: నగరంలో పలు స్వీట్ షాపులపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీకృష్ణ బృందం, ఆహార భద్రత అధికారులు సంయుక్తంగా ఈ దాడులు చేశారు. స్వీట్ ఇండియా, శ్రీ శివరామ స్వీట్స్, స్వగ్రామ ఫుడ్స్, తాపేశ్వరం వారి లక్ష్మీ గణపతి స్వీట్స్ తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో నాణ్యతా ప్రమాణాలు, లైసెన్సులు, తయారీ సమయంలో పాటిస్తున్న ప్రమాణాలు, కార్మిక శాఖ నిబంధనలు, జీఎస్టీ సర్టిఫికేట్లు పరిశీలించారు. స్వగ్రామ ఫుడ్స్‌కు సంబంధించి ఇసుకతోటలో ఉన్న తయారీ కేంద్రంలో బ్రాండింగ్ లేకుండా బయట తయారయ్యే నెయ్యిని వినియోగిస్తున్నట్టు గమనించారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆ నెయ్యిని సీజ్ చేసి శాంపిల్ తీసి ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 ప్రకారం కేసు నమోదు చేసి నోటీసు జారీచేశారు. అదే విధంగా పలు కేంద్రాల్లో శుభ్రతా ప్రమాణాలు పాటించడం లేని కారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జిగా సాయి మౌనిక ఎంపిక



విశాఖ లీగల్ : నగరంలోని జూనియర్ న్యాయవాది కుమారి కొమ్మూరి సాయి మౌనిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఇటీవల జరిగిన పరీక్షల్లో ఆమె ఉత్తమ ర్యాంక్ సాధించారు. ఇటీవల ఫలితాలు విడుదలయ్యాయి. హైకోర్టు నిర్వహించిన ఈ పరీక్షల్లో విశాఖ నుంచి సాయి మౌనిక ఎంపికైంది. ఆమె విజయం సాధించడంపై విశాఖ న్యాయవాద సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ, కార్యదర్శి డి. నరేష్, న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించారు.

అరకు రైలుకు అదనపు కోచ్‌లు




తాటిచెట్లపాలెం: అరకు రైలుకు ప్రయాణికులరద్దీ దృష్ట్యా ఆయా తేదీల్లో అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు1, 3వ తేదీల్లో 1–విస్టాడోమ్ కోచ్, డిసెంబర్ 2,4వ తేదీలలో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్, తిరుగుప్రయాణంలో కిరండూల్ –విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2,4వ తేదీల్లో 1–విస్టాడోమ్, డిసెంబరు 3,5వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను జతచేస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

మహారాణిపేట: రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ సత్తిబాబును నియమించారు. జె.సీతారామా రావును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జాతీయ రహదారి–16 నియమించారు. కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బీ.వీ.రమణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.బేగం, సనపల సుధా సాగర్‌ను హెచ్‌పీపీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, హెచ్‌వీ జయరామ్‌ను సివిల్ డిఫెన్స్ ఎస్‌డీసీగా, పి.కృష్ణమూర్తిని ఏపీఐఐసీ ఎస్‌డీసీ(ఎల్ఏ)గా నియమించారు.

బాల్యానికి భద్రత

బాల కార్మికులను గుర్తించేందుకు కార్మిక శాఖ ప్రత్యేక డ్రైవ్



- 10 రోజుల పాటు నిర్వహణ.. 33 మంది బాలకార్మికులకు విముక్తి
- కనీస వనివేతనాల చట్టం కింద 33 కేసుల నమోదు
- యాజమాన్యాలకు రూ.1,26,325 జరిమానా విధింపు
- బాల కార్మికుల చట్టం కింద 3 దుకాణాలపై కోర్టులో కేసు



బాల కార్మికుడిని గుర్తించిన అధికారులు

విశాఖ సిటీ: బాల్యం చితికిపోతోంది. ఆట పాటలతో అల్లారుముద్దుగా పెరగాల్సిన వారు కూలీలుగా మగ్గిపోతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులతో దుకాణాల్లో పనిముట్లు పట్టుకుంటున్నారు. కుటుంబ పోషణ కోసం వయసుకు మించిన భారాన్ని మోస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఎన్ని చర్యలు చేపడుతున్నా.. బాలలు ఇప్పటికీ కార్మికులుగా దర్శనమిస్తూనే ఉన్నారు. దీనిపై జిల్లా కార్మిక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్గదర్శకాల మేరకు పాన్ ఇండియా బాలల సంరక్షణ, పునరావాస కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాలతో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత పర్యవేక్షణలో బాల కార్మికులను గుర్తించేందుకు నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

33 మంది బాలకార్మికులకు విముక్తి

జిల్లాలో నెల రోజుల పాటు బాల కార్మికులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. కార్మిక శాఖ, విద్య, శిశుసంక్షేమం, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమం ఇలా పలు శాఖల అధికారులతో పాటు ఎన్‌జీవో ప్రతినిధులతో కలిపి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీలు రెండు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 21వ తేదీ నుంచి నవంబర్ 20 వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా తనిఖీలు చేపట్టారు. సర్కిల్–1 అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో .. సర్కిల్–2 అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో మరో టీమ్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఇందులో పలు వ్యాపార సంస్థలు, దుకాణాల్లో పనిచేస్తున్న 33 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. ఇందులో 14 ఏళ్ల కంటే తక్కువ వయసున్న ముగ్గురు చిన్నారులను గుర్తించారు. వీరితో పనులు చేయిస్తున్న షాపుల యాజనులపై కేసులు పెట్టి రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు పంపించారు. అలాగే వారి నుంచి ఒక్కో బాలుడి కోసం రూ.20 వేలు చొప్పున జరిమానాలు వసూలు చేశారు. ఈ నగదును ఆయా బాలల పేర్ల మీద బ్యాంకుల్లో ఫిక్సిడ్ డిపాజిట్ చేయనున్నారు.

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో బాల కార్మికులు లేకుండా చేసేందుకు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎక్కువగా అపార్టుమెంట్లలో ఇంటి పనులకు, క్యాటరింగ్ పనులకు, సెలవు సమయాల్లో డబ్బు కోసం పిల్లలు పనులకు వెళ్తున్న విషయాన్ని అధికారులు గ్రహించారు. దీంతో త్వరలోనే అపార్టుమెంట్‌వాసులతో పాటు క్యాటరింగ్ సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. బాలలను పనులకు పెట్టుకోకూడదన్న విషయాన్ని వారికి అవగాహన కల్పించనున్నారు.

రూ.1.26 లక్షల ఫైన్ విధింపు

ఈ డ్రైవ్‌లో కొంత మంది వ్యాపారులు కనీస వేతనాల చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించారు. ఒకవైపు 14 నుంచి 18 ఏళ్లలోపు బాలకార్మికులతో పనిచేయించడంతో పాటు వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. 30 మంది నుంచి రూ.1,26,325 అపరాధ రుసుము వసూలు చేశారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవు



పిల్లలను పనుల్లో పెట్టుకుంటే సదరు వ్యాపారులపై చర్యలు తప్పవు. జిల్లాలో బాల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎప్పటికప్పుడు బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఎవరైనా చిన్నారులను గుర్తిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. పిల్లలను స్కూల్‌కు పంపించే ఏర్పాట్లు చేస్తున్నా. బాలలను పనిలో పెట్టుకోవడం నేరమన్న విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– ఎం.సునీత, డిప్యూటీ కమిషనర్, కార్మిక శాఖ

స్థాయీ సంఘంలో 113 అంశాలు ఆమోదం



మాట్లాడుతున్న స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 117 అంశాలను పొందుపరిచారని, అందులో 4 అంశాలు వాయిదా వేయగా..మిగిలిన 113 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, పలు అభివృద్ధి పనులకు, రెవెన్యూ అంశాలకు సంబంధించి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

నిరాశ్రయ షెల్టర్ పరిశీలించిన తర్వాతే..

జీవీఎంసీకి చెందిన ఏయూటీడీ ఎన్‌జీవోచే నిర్వహిస్తున్న మూడు నైట్ షెల్టర్లు (టీఎస్సార్ పురుషులు, టీఎస్సార్ స్త్రీలు, భీమ్‌నగర్ షెల్టర్) నిర్వహణ కాలపరిమితి (1–5–2024 నుంచి 30–4–2025 వరకు) పొడిగించే అంశం స్థాయి సంఘం ఆమోదానికి వచ్చింది. ఇందుకు సంబంధించి ఓఅండ్ఎం ఖర్చు రూ.25.92 లక్షలు మంజూరు చేసే అంశంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నైట్ షెల్టర్లలో ఎంతమంది నిరాశ్రయులు ఉంటున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తుంటే ఎందుకు జీవీఎంసీ బోర్డు ఏర్పాటు చేయలేదు? ఒకే వ్యక్తి ఎందుకు నడపాలి? ఓపెన్ ఆక్షన్ ద్వారా మరొకరకి అవకాశం ఇవ్వొచ్చు కదా? ఇలా పలు ప్రశ్నలు యూసీడీ అధికారిపై కురిపించారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని వాయిదా వేశారు. నైట్ షెల్టర్లను విజిట్ చేస్తామని, ఆ తరువాతే ఈ అంశాన్ని చర్చిద్దామని సభ్యులు స్పష్టం చేశారు.

ఇద్దరి కోసమే...

స్థాయీ సంఘ సమావేశాలు ఆ ఇద్దరి కోసమే నిర్వహిస్తున్నట్టుందని సభ్యులు చెవులు కొరుక్కొంటున్నారు. ఆ ఇద్దరిలో ఓ కార్పొరేటర్‌కు ఏకంగా సుమారుగా రూ.5 కోట్ల పనులు, మరో కార్పొరేటర్‌కు రూ.2 కోట్ల పైబడి పనులు ఆమోదానికి వచ్చాయి. అయితే మా పరిస్థితి ఏంటని మిగతా సభ్యులు రుసరుసలాడారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీఆర్ ఎస్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, జోన్–1, 3, 4 జోనల్ కమిషనర్లు ప్రేమప్రసన్న వాణి, కె శివప్రసాద్, మల్లయ్యనాయుడు, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, శేఖర్, శాంతిరాజ్, చిరంజీవి, మురళీకృష్ణ, ఏఎమ్ఓహెచ్‌లు ప్రసాదరావు, అప్పలనాయుడు, డాక్టర్ ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రంగానికి సహకారం



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, వంశీకృష్ణ , విష్ణుకుమార్ రాజు

ఎంవీపీకాలనీ: రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందివ్వనున్నట్టు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహిస్తున్న 10వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభ కార్యక్రమంలో శుక్రవారం ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాన్ని సులభతరం చేయడంలో, వినియోగదారులకు నమ్మకమైన సేవలను చేరువచేయడంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ దశాబ్దకాలంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. భోగాపురం విమానాశ్రయంతో పాటు మెరుగైన కనెక్టివిటీ రహదారి నిర్మాణంతో రాబోయే రోజుల్లో అద్భుతమైన నిర్మాణ ప్రాజెక్టులు విశాఖలో ప్రారంభం కానున్నాయన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం చైర్మన్ కేఎస్ఆర్‌కే సాయి (రాజు) మాట్లాడుతూ క్రెడాయ్ విశాఖపట్నం ఇప్పటికే 9 ప్రాపర్టీ ఎక్స్‌పోలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. 10వ ప్రోపర్టీ ఎక్స్‌పో డిసెంబర్ 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 25 పెద్ద బ్రాండ్ బిల్డర్స్‌తో సహా 71 ప్రాజెక్టులు ఈ ఎక్స్‌పో ద్వారా ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్, బ్యాంక్స్, స్టీల్ కంపనీలు, సిమెంట్, సోలార్ ఇలా నిర్మాణ రంగానికి అవసరమైన అన్ని రకాల సంస్థలు ఈ ఎక్స్‌పోలో స్టాల్స్ ఏర్పాటు చేసి వారి ప్రాజెక్టుల వివరాలను, ఆఫర్లను వినియోగదారులకు తెలియజేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, క్రెడాయ్ వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి వి.శ్రీను, ఎక్స్‌పో కన్వీనర్ సీహెచ్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

సిటీకి జ్వరమొచ్చింది

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) కొద్ది రోజులుగా జ్వర బాధితులతో కిటకిటలాడుతోంది. ఇక్కడ నమోదవుతున్న ఓపీలో సగానికి పైగా జ్వరాలతో బాధపడుతున్నవారే ఉన్నారు. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతూ ఇక్కడ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ తదితర సమస్యలకు సంబంధించిన వారి ఓపీ ఎక్కువగా ఉంటుంది. కొద్ది రోజులుగా వాటి సంఖ్య కంటే జ్వరాలతో బాధపడుతున్న వారే సంఖ్య ఎక్కువగా ఉంది. శుక్రవారం విమ్స్‌కు వివిధ సమస్యలతో వచ్చిన వారు 655 మంది ఉండగా..అందులో జ్వరాలతో బాధపడుతున్న వారు 342 మంది ఓపీలో నమోదయ్యారు. కొద్ది రోజులుగా జ్వర పీడితుల సంఖ్యలో పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నట్లు తెలిపారు.

173 మంది పోలీసులకు రివార్డులు



రివార్డు ఆర్డర్‌ను అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: కేసులు ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 173 మంది పోలీసులు రివార్డులు అందుకున్నారు. గత నెలలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారులకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం రివార్డు ఆర్డర్లు అందజేశారు. గంజాయి రవాణా, చోరీ సొత్తు స్వాధీనం, నిందితుల అరెస్ట్, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పేరు మోసిన నేరస్తులను అరెస్టు చేయడం, సైబర్ క్రైం కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సీపీ అభినందించారు.

ఎమ్మెల్యే కొలికపూడిపై అనర్హత వేటు వేయాలి

సీతమ్మధార: మతం మారిన క్రైస్తవులకు రిజర్వేషన్లు వర్తించవన్న సుప్రీంకోర్టు తీర్పు దుర్మార్గమన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు శుక్రవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పోరాడాలని చర్చిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తక్షణమే స్పందించి కొలికపూడిపై అనర్హత వేటు వేయాలని కోరారు. హిందూ దళిత ముసుగులో రిజర్వేషన్లు అనుభవిస్తున్న మతం మారిన క్రైస్తవులను ఉద్దేశించి సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే కొలికపూడికి ఎందుకు అంత ఉలికిపాటని, కొలికపూడి మతం ఏదో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు

- ఉదయం 8.40 గంటలకు తొలి పూజ
- ఉత్సవ ఏర్పాట్లను వివరించిన ఈవో

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర వాసుల కల్పవల్లి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 2 నుంచి 30 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 2వ తేదీ ఉదయం 8.40 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ తొలి పూజ చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారని తెలిపారు. మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో(5, 12, 19, 26) అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 5వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటలకు తొలి గురువారం మొదటి పూజ, పంచామృతాభిషేక సేవ చేసి దర్శనాలు ప్రారంభిస్తామన్నారు. కనకమహాలక్ష్మికి గురువారం ప్రీతిపాత్రం కావడంతో ఆ రోజున ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 22న చతుర్వేద సభ, అర్చక సదస్సు, 23న నాదస్వర కచేరీ, 26న సహస్ర ఘటాభిషేకం, మహాన్నదానం ఉంటుందన్నారు. 28న మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి ఆలయం వరకు రథయాత్ర నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ 3 వేల మందికి, గురువారాల్లో 50 వేల మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేవస్థానం తరఫున ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు రెండు లైన్లు ఉంటాయని, ప్రధాన రహదారిపై పోలీసుల సూచన మేరకు మరిన్ని క్యూలు ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ సూచనల మేరకు పెండాళ్లు వేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ 2 వేల మందికి, 26న నిర్వహించే మహాన్నదానం రోజున 20 వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం వద్ద మహాన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి, అధికారులు

ఉచిత బస్సు సౌకర్యం

మున్సిపల్ స్టేడియం, విక్టోరియా ఆస్పత్రి, కొత్తరోడ్డు ఆర్చి గేటు వద్ద పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. నగర శివార్ల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత బస్సులు నడిపేందుకు దాతలు సాయం చేస్తున్నారని వెల్లడించారు. ఆనందపురం, మధురవాడ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు.

క్యూలు ఇలా..

ధర్మదర్శనం ఉచితంగా చేసుకోవచ్చని, రూ.500తో విశిష్ట దర్శనం, రూ.200తో ప్రత్యేక దర్శనం, రూ.100తో శీఘ్ర దర్శనం ఉంటుందన్నారు. రీడింగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు పొందవచ్చన్నారు. గురువారం రోజున నిర్వహించే పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.7,500, సాధారణ రోజుల్లో రూ.2,500 టికెట్‌గా నిర్ణయించామని, ఒక టికెట్‌పై దంపతులు, ఇద్దరు చిన్న పిల్లలు పాల్గొనవచ్చన్నారు. ఉదయం 5 నుంచి 6, 11.30 నుంచి 12 గంటల మధ్య ఈ సేవ ఉంటుందన్నారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

తగరపువలస: గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో మూడవ రోజైన శుక్రవారం శ్రీనివాసుడికి, దామోదరుడికి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. నిష్కించిన భక్తదాస, అంబరీష దాస స్వామీజీల సమక్షంలో తొలి దీపాన్ని యదురాజ దాస స్వామీజీ వెలిగించగా, అఖండ దీపాన్ని రాంజీ కుటుంబ సభ్యులు వెలిగించారు. సంగీత వాయిద్యాల నడుమ దామోదర అష్టకం ఆలపిస్తుండగా భక్తులు నెయ్యి దీపాలతో హారతులు అందించారు. అనంతరం భక్తులు లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వివిధ ఆకృతులతో దీపాలంకరణను చూసి భక్తులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.



దీపాల వెలుగుల మధ్య ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు, దామోదరుడు

ఏయూలో కొత్త కోర్సు

- ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సు నిర్వహణకు ఏర్పాట్లు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఏయూతో అవాంటెల్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, అవాంటెల్ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు రెండో సంవత్సరంలో రూ.25 వేలు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు రూ.9 లక్షల వార్షిక వేతనంతో అవాంటెల్ సంస్థ ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకొచ్చిందన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్- వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన కోర్సులను రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు అనువైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవాంటెల్ అడ్వైజర్ డాక్టర్ నాగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అభ్యసనానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ వేణుగోపాల్ అట్లూరి, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.భాస్కర్, జనరల్ మేనేజర్(హెచ్.ఆర్) శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ ఫార్మా బాధితులకు మంత్రి పరామర్శ



షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

అక్కిరెడ్డిపాలెం: ఠాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో ఇద్దరు చనిపోవడం బాధాకరమని, ఇందులో యాజమాన్యం నిర్లక్ష్యం కొంత ఉందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.40 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను యాజమాన్యం నుంచి కలెక్టర్ ద్వారా అందజేస్తామని ప్రకటించారు. ప్రమాదం తర్వాత 26 మంది చికిత్స కోసం ఆస్పత్రిలో చేరినట్లు చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఉన్నారు. కాగా.. ప్రస్తుతం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో 8 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే ఇద్దరు మరణించగా.. మరో వ్యక్తి ఐసీయూలోని క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

నేడే అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం

పద్మనాభం: పద్మనాభంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. దీపోత్సవానికి అవసరమయ్యే తైలం, ప్రమిదలు, వత్తులను సిద్ధం చేసింది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి దర్శనానికి వెళ్లే భక్తులను సౌకర్యార్థం అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గిరి ప్రథమ పావంచా వద్ద, 1,200 మెట్ల వద్ద పందిళ్లు వేశారు. 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ అప్పలరాజు తెలిపారు.

2 నుంచి శ్రీనృసింహ దీక్షలు ప్రారంభం

- జనవరి 12న రెండు దీక్షల ముగింపు

సింహాచలం: ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షలకు దేవస్థానం అధికారులు తిథులను అనుసరించి తేదీలను ప్రకటించారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 41 రోజుల మండల దీక్ష, డిసెంబర్ 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదికులు ఉదయం 7 గంటలకు మాలధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

లారీ ఢీ కొని యువకుడి మృతి

అక్కిరెడ్డిపాలెం: పాతగాజువాక పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ప్రమాదానికి సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత గాజువాక నుంచి శ్రీనగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీ కొట్టి అతడిపై నుంచి వెళ్లి పోయింది. ప్రమాదంలో యువకుడి తల శరీరం నుజ్జవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతి చెందిన యవకుడి వద్ద దొరికిన లైసెన్స్‌లో శీదిరి అప్పలనాయుడు అని ఉందని పోలీసులు తెలిపారు. యువకుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా శాంతి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా బి.శాంతి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ ఎస్టేట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన లక్ష్మారెడ్డిని ప్రభుత్వం కొద్ది రోజుల క్రితమే బదిలీ చేసింది. అలాగే వుడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా బి.దయానిధి నియమితులయ్యారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సబ్బవరం గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న హోం శాఖ మంత్రి అనిత

సబ్బవరం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సబ్బవరం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో, మధురవాడ సీవోఈలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో సబ్బవరం విద్యార్థుల ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే.. ఈ నెల 25, 26 తేదీల్లో పల్నాడు జిల్లా ఆర్.కె.పురం, సత్తెనపల్లి గురుకుల పాఠశాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఐసీటీ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు రూ.7,500 నగదు బహుమతిని అందుకున్నారు. అలాగే క్రాఫ్ట్ వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం సాధించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విద్యార్థులు ఎం.అశోక్, డి.విశ్వనాథ్, ఎల్.మున్నా, జె.సంపత్ వినయ్‌తోపాటు గైడ్ టీచర్లు టి.రాంబాబు, డి.నానాజీ, ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణలను అభినందించారు.

5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

మహారాణిపేట: జిల్లా సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు వచ్చే నెల 5 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 2న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి ఆ రోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం మొత్తం 316 సాగునీటి సంఘాలు ఉన్నాయి.

విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా టీవీ శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ఈవో/అసిస్టెంట్ డైరెక్టర్ల బదిలీల్లో భాగంగా శ్రీనివాసరావును జిల్లాకు కేటాయిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం విజయనగరం డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్నారు.

పీఎంపాలెం, పెందుర్తిలో రైతు బజార్ల ఏర్పాటు

మహారాణిపేట: పీఎంపాలెం, పెందుర్తిలో రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నట్టు జేసీ మయూర్ అశోక్ తెలిపారు. శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆరిలోవ,తగరపువలస ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు కోసం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ రెండు బజార్లకు నిధులు విడుదల చేయాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశామన్నారు.

కరణ్ బాదుడు.. విదర్భ విజయం

- మరో మ్యాచ్‌లో పుదుచ్చేరి గెలుపు

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీలో పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అసోంపై విదర్భ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. విదర్భ ఓపెనర్ కరణ్ 47 బంతుల్లోనే ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 75 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో టాస్ గెలిచి విదర్భ ఫీల్డింగ్ ఎంచుకుంది. అసోం నిర్ణీత 20 ఓవర్లలో మరో ఐదు బంతులుండగానే 123 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ దినేష్ అత్యధికంగా 31 పరుగులు చేశాడు. ప్రతిగా విదర్భ రెండే వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. డేనైట్‌గా జరిగిన మరో మ్యాచ్‌కు వరుణుడు అడ్డంకిగా నిలిచాడు. దీంతో ఇన్నింగ్స్‌ను ఆరు ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి నిర్దేశించిన ఆరు ఓవర్లలో రెండు వికెట్లకు 91 పరుగులు చేసింది. ప్రతిగా ఒడిశా మూడు వికెట్లు కోల్పోయి 75 పరుగులే చేసింది. దీంతో 16 పరుగుల తేడాతో ఒడిశాపై పుదుచ్చేరి విజయం సాధించింది.

సంస్థలు,పరిశ్రమల సమన్వయంతోనే అభివృద్ధి

విశాఖ విద్య: సంస్థలు-పరిశ్రమల సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఇండస్ట్రీ-అకాడెమియా సమ్మేళనం 2024 జరిగింది. ఇంధన రంగంలోని పురోగతి, సవాళ్లపై విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సన్నిహిత సహకారం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడం, వారికి ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఐపీఈ డీన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు కనుపర్తి నాగరాజా(హెచ్‌పీసీఎల్), డాక్టర్ సెంథిల్ మురుగన్ బాలసుబ్రమణ్యన్(రిలయన్స్), డా.మురళీకృష్ణ కలగ(జీఈ వెర్నోవా), డా.కృష్ణకాంత్, డా.హేమంత్ తదితరులు ప్రసంగించారు.

ఐఎంఏ ఎన్నికలపై రగడ

విశాఖ సిటీ: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వార్షిక ఎన్నికల్లో వివాదం రాజుకుంటోంది. ఆన్‌లైన్‌లో ఓటును వినియోగించుకునే వారందరికీ ఒకే ఓటీపీ రావడం వెనుక కుట్ర ఉందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కొంత మంది సభ్యులు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. గత నెల 21, 22 తేదీల్లో ఐఎంఏ విశాఖ చాప్టర్ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 1750 మంది సభ్యులకు గానూ, 1400 మంది సభ్యులు మాత్రమే పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 973 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్నికల నిర్వాహకులు ఎన్నికల ఐడీ, పాస్‌వర్డ్‌లను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఓటింగ్‌లో పాల్గొన్న వారందరికీ ఒకే ఓటీపీ రావడంపై కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

102 కిలోల గంజాయి స్వాధీనం

- చెన్నైకు రవాణా చేసేందుకు మహిళ ప్రయత్నిస్తుండగా పట్టుకున్న పోలీసులు

విశాఖ సిటీ: విశాఖ నుంచి తమిళనాడుకు రైలులో గంజాయి రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్న మధురైకు చెందిన మహిళను నగర పోలీసులు పట్టుకున్నారు. ఆమె నుంచి రూ.13 లక్షల విలువైన 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ-2 మేరీ ప్రశాంతి తెలిపారు. పోలీస్ సమావేశంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు స్టేషన్ వద్ద నిఘా పెట్టారు. కాగా.. ఈ నెల 28న ఒక మహిళ స్కూటీపై నాలుగు ప్లాస్టిక్ బ్యాగులతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాం చివరి నుంచి రైల్వేస్టేషన్‌లోకి తరలించే ప్రయత్నం చేసింది. ఇంతలో మహిళా పోలీస్ సిబ్బంది ఆమెను నిలువరించి ఆ బ్యాగులను తనిఖీ చేశారు. అందులో రెండు కిలోలు చొప్పున 51 ప్యాకెట్లలో 102 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని సీజ్ చేసి మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. మధురైకి చెందిన సెల్వి తన మామ లక్ష్మణన్ శేఖర్‌తో కలిసి విశాఖకు వచ్చినట్లు చెప్పింది. ముందుగా మామ గంజాయిని తీసుకువచ్చి సెల్వీకి అందించాడు. దీన్ని దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి చెన్నైకు తరలిస్తున్నట్లు ఆమె అంగీకరించిందని డీసీపీ తెలిపారు. ప్రస్తుతం కేసు ఇంకా విచారణలో ఉందని, ఇక్కడ ఎవరి నుంచి గంజాయిని కొనుగోలు చేశారు, తమిళనాడులో ఎవరికి విక్రయించాలనుకుంటున్నారు? ఇలా అన్ని విషయాలపై విచారిస్తున్నట్లు వెల్లడించారు. మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆమె మామ శేఖర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మధురై పోలీసులకు కూడా సమాచారం అందించినట్లు చెప్పారు. విశాఖను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నంతో నిఘాను పటిష్టం చేశామని డీసీపీ-2 మేరీ ప్రశాంతి తెలిపారు. సౌత్ ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీసీపీ-2 మేరీ ప్రశాంతి

హత్యాయత్నం కాదు.. ఆత్మహత్యాయత్నం



మెడపై గాయాలతో అప్పారావు

ఆరిలోవ: పెదగదిలి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఓ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తోటగరువుకు చెందిన గవిరెడ్డి అప్పారావుపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసినట్లు వార్తలు వ్యాపించాయి. దీంతో స్థానికులు, ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి పరుగులు తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసుల విచారణలో ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలివీ.. గవిరెడ్డి అప్పారావుపై శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో పెదగదిలి వద్ద కొత్తగా నిర్మించిన వంతెన పక్కన దుకాణం చాటున హత్యాయత్నం జరిగినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ కృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికి అప్పారావు మెడపై గాయాలతో తీవ్ర రక్తస్రావం అవుతోంది. ఇద్దరు వ్యక్తులు ముసుగు వేసుకుని తనపై కత్తితో దాడి చేసి మెడపై కోశారని అప్పారావు ఎస్ఐకి తెలిపాడు. వెంటనే పోలీసులు అప్పారావును విమ్స్‌కు తరలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హత్యాయత్నం కేసుగా నమోదు చేశారు. అప్పారావుకు చికిత్స అనంతరం స్టేషన్‌కు తరలించి మళ్లీ ప్రశ్నించగా.. అసలు నిజం చెప్పారు. అప్పుల బాధ తట్టుకోలేక తానే బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కంగుతిన్న పోలీసులు.. ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి పూట నిఘా పటిష్టం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగరంలో క్రైం రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్ష చేశారు. ఎజైల్ యాప్‌ను అందరూ ఉపయోగించాలని చెప్పారు. ట్రాఫిక్ ఈ-చలనాలను కొత్తగా రూపొందించిన NextGen mParivahan యాప్ ద్వారా చెల్లించే విధానంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పలు న్యాయ సంబంధిత అంశాలపై చర్చించారు. నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీపీ సంబంధించి స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. గంజాయి ఎక్కడా ఉండకూడదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటివి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులపై ఆరా తీశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా తమ విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీపీ-1 అజితా వేజెండ్ల, జాయింట్ సీపీ(ఇన్‌చార్జ్), డీసీపీ-2 డి.మేరీ ప్రశాంతి, డీసీపీ(క్రైం) కె.లతామాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చీ